క్లుప్తంగా

గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలి



చెత్త సంపద కేంద్రం నిర్మాణంపై సిబ్బందితో చర్చిస్తున్న ఎంపీడీఓ

బేతంచెర్ల: మండలంలోని గ్రామాలను పరిశుభ్రంగా ఉంచాలని పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ ఫజుల్ రహిమాన్ సూచించారు. ఎం.పేండేకల్లు గ్రామాన్ని ఈఓఆర్డీ మల్లికార్జునతో కలిసి శుక్రవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని గ్రామాల్లో డ్రైనేజీ కాల్వలను శుభ్రంగా ఉంచాలన్నారు. అలాగే ప్రజల్లో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన పెంచాలని సూచించారు. గ్రామంలో నిర్మించనున్న చెత్త సంపద కేంద్రానికి సంబంధించిన స్థలంపై పంచాయతీ కార్యదర్శి నాగప్రసాద్‌తో ఆయన చర్చించారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన



విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఎంఈఓ

బేతంచెర్ల: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఎంఈఓ సోమశేఖర్ సూచించారు. శనివారం మండల పరిధిలోని బుగ్గానిపల్లె ప్రాథమిక ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల రికార్డులు, విద్యార్థుల హాజరు శాతం, మధ్యాహ్న భోజనంను పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కొలిమిగుండ్ల: విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉన్నతంగా తీర్చిదిద్దాలని ఎంఈఓ అబ్దుల్ కలాం సూచించారు. శనివారం అంకిరెడ్డిపల్లె మోడల్ ప్రైమరీ పాఠశాలను ప్రార్థనా సమయంలో తనిఖీ చేశారు. వ్యక్తిత్వ వికాసం, చదువుపై శ్రద్ధ పెట్టాలని విద్యార్థులకు సూచించారు. ద సీక్రెట్ లైఫ్ పుస్తకంలోని అమూల్యమైన విషయాలను వివరించారు. తరగతి గదులను పరిశీలించి వసతుల గురించి ఆరాతీశారు.విద్యాభివృద్ధిపై ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. హెచ్ఎం ఆదిశేషయ్య, ఉపాధ్యాయులు శ్రీలత, వెంకటేష్ పాల్గొన్నారు.

సీహెచ్‌సీ తనిఖీ



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోట్ల

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి సీహెచ్‌సీని డోన్ ఎమ్మెల్యే కోట్ల జయ సూర్య ప్రకాశ్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించి రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరాతీశారు. ఆస్పత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలన్నారు. అంతక ముందు బుగ్గానిపల్లె, బుగ్గానిపల్లె తండ, సిమెంట్ నగర్ గ్రామంలో పర్యటించారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్యే కోట్ల సుజాతమ్మ, నగర పంచాయతీ కమిషనర్ హరి ప్రసాద్ ఉన్నారు.

ధర్నాను విజయవంతం చేద్దాం



కరపత్రాలను పంపిణీ చేస్తున్న సీపీఎం నాయకులు

బనగానపల్లె రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 9న జిల్లా కేంద్రంలో జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం డివిజన్ కార్యదర్శి సుబ్బయ్య పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని పెట్రోల్‌బంకు సెంటర్‌లో ఆటో కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేశారు. అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా నియమించాలన్న ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులకు నష్టం కలిగించేలా ఉన్న లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

రామ్‌కోతో చర్చలకు తరలిరండి

కొలిమిగుండ్ల: కల్వటాల సమీపంలోని రామ్‌కో సిమెంట్ ఫ్యాక్టరీకి భూములు ఇచ్చిన రైతులు తమ సమస్యల పరిష్కారం కోసం సోమవారం రామ్‌కో వద్ద నిర్వహించే చర్చలకు తరలిరావాలని రైతు సంఘం నాయకులు తెలిపారు. ఫ్యాక్టరీ వల్ల నష్టపోయిన రైతులతో పాటు భూములు విక్రయించిన రైతుల కుటుంబాల్లో ఉద్యోగాల కల్పన, సిమెంట్ ఫ్యాక్టరీ తీసుకున్న దేవాలయ భూములను అదే గ్రామాల్లోనే ఫ్యాక్టరీకి చెందిన భూములను ఇవ్వాలని తదితర డిమాండ్ల కోసం గత నెల 30 తేదీ రైతు సంఘం, సీపీఐ నాయకులతో కలిసి ధర్నా నిర్వహించామన్నారు. ఆ సమయంలో 7వ తేదీ చర్చలకు ఆహ్వానించారన్నారు. రైతులు తప్పక హాజరుకావాలని కోరారు.

రాజీయే రాజమార్గం



కోవెలకుంట్లలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న న్యాయమూర్తి భాస్కర్



బనగానపల్లె కోర్టులో కక్షిదారులతో మాట్లాడుతున్న జడ్జి ప్రతిమ

కోవెలకుంట్ల: కక్షిదారులకు రాజీయే రాజమార్గమని కోవెలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి టి. భాస్కర్ అన్నారు. స్థానిక కోర్టులో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. కోవెలకుంట్ల పోలీస్ సర్కిల్ పరిధిలో రాజీకి అవకాశం ఉన్న 309 కేసులను పరిష్కరించారు. ఏడు ఐపీసీ, సీసీ 23, ఎస్టీసీ 269, పీఎల్‌సీ 6, ఓఎస్‌లు 3, ఎస్ఐఏ ఒక కేసును పరిష్కరించారు. అనంతరం జడ్జి మాట్లాడుతూ.. లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఓబులేసు, సెక్రటరీ రమేష్, న్యాయవాదులు జీఎల్ నరసింహులు, శేఖర్, రాజశేఖర్, తిరుపతయ్య, తిరుపాలు పాల్గొన్నారు.

డోన్‌లో 735 కేసులు పరిష్కారం

డోన్ టౌన్: స్థానిక కోర్టు సముదాయాల భవనంలో జరిగిన లోక్ అదాలత్‌లో 735 కేసులను పరిష్కరించినట్లు సీనియర్ సివిల్ జడ్జి టి.మల్లేశ్వరి, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ఎస్.అనీల్‌కుమార్ తెలిపారు. ప్యాపిలి పోలీస్‌స్టేషన్ పరిధిలో 4, జలదుర్గం–12, కృష్ణగిరి–6, బేతంచెర్ల–11, డోన్ రూ రల్–11, డోన్ టౌన్– 11,వెల్దుర్తి–8తో పాటు ఎక్సై జ్ కేసులు 17, అడ్మిషన్స్ 111, ఓఎస్ 1, ఈపీ 6, ఎస్టీసీలు 534 కలిపి మొత్తం 735 కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్లు న్యాయమూర్తులు తెలిపారు.

బనగానపల్లెలో 404 కేసులు పరిష్కారం

బనగానపల్లె రూరల్: స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో శనివారం జరిగిన లోక్‌అదాలత్‌లో మొత్తం 404 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు సిబ్బంది తెలిపారు. ఇందులో సీసీ 65 కేసులు, ఓఎస్ 5, పీఎల్‌సీ 34, ఎస్టీసీ 334 కేసులు ఉన్నట్లు పేర్కొన్నారు.

నట్టల నివారణతో జీవాలు ఆరోగ్యం

సంజామల: గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు వేయించడం ద్వారా ఆరోగ్యంగా ఉంటాయని పశుసంవర్ధకశాఖ డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య అన్నారు. శనివారం సంజామల, కానాలలో జరిగిన ఉచిత నట్టల నివారణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. గొర్రెల కాపరులు గొర్రెలు, మేకలకు వచ్చే జబ్బులపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. వర్షాకాలంలో ఎక్కువగా జీవాలకు నట్టల వ్యాధి వచ్చే అవాశం ఉందన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉచితంగా నట్టల నివారణ మందులు పంపిణీ చేస్తోందన్నారు.



కానాల గ్రామంలో నట్టల నివారణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ రమణయ్య

ఈనెల 10వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

ఎద్దుల బండిని ఢీకొన్న ఆటో

ఎద్దు మృతి, ముగ్గురికి గాయాలు

డోన్ టౌన్: ఎద్దుల బండిని ఆటో ఢీకొనడంతో ముగ్గురికి గాయాలు కాగా ఎద్దు మృతిచెందింది. ఈ ఘటన మండలంలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో శనివారం చోటుచేసుకుంది. కృష్ణగిరి మండలం అముకదాడు గ్రామానికి చెందిన రైతు దంపతులు ఉడుములపాడు గ్రామంలో ఉన్న కుమార్తె పొలంలో విత్తనాల విత్తడానికి కాడి ఎద్దులతో బండిపై వస్తుండగా డోన్ నుంచి టమాట లోడుతో వెళ్తున్న ఆటో ఎద్దుల బండిని ఢీకొంది. రైతు దంపతులతో పాటు



ధ్వంసమైన ఆటో, మృతిచెందిన ఎద్దు

డ్రైవర్ గాయపడడంతో డోన్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తీసుకెళ్లారు.

హరిత బనగానపల్లె చేయడమే లక్ష్యం

బనగానపల్లె రూరల్: పట్టణాన్ని పచ్చదనంతో తీర్చిదిద్దడమే తన లక్ష్యమని మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. శనివారం మంత్రి పుట్టిన రోజు సందర్భంగా బనగానపల్లె ప్రభుత్వ వైద్యశాల, ఎంపీడీఓ కార్యాలయం, డిగ్రీ కళాశాల, తహసీల్దార్ కార్యాలయం, పోర్‌లైన్స్ సెంటర్లలో మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. తన సతీమణి ఇందిరమ్మ రూ.30 లక్షల సొంత నిధులతో మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు మంత్రి తెలిపారు. అంతకు ముందు మంత్రి క్యాంపు కార్యాలయం నుంచి పెట్రోల్‌బంకు సెంటర్, ఆస్పత్రి వరకు ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో కలెక్టర్ రాజకుమారి, వివిధ శాఖల అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఈఓ సుబ్బారెడ్డి, తహసీల్దార్ నారాయణరెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్యశాల ప్రాంగణంలో మొక్క నాటుతున్న మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, కలెక్టర్

సమస్యలు పరిష్కరించాలని వినతి

డోన్ టౌన్: మున్సిపల్ ఇంజినీరింగ్ విభాగంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు అన్వర్, అబ్బాస్ డిమాండ్ చేశారు. కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా శనివారం మున్సిపల్ కమిషనర్ ప్రసాద్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సమాన పనికి సమాన వేతనం కల్పించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు కార్మికులకూ వర్తింపజేయాలని, మరణించిన కార్మికుల కుటుంబాలకు ఉద్యోగావకాశాలు కల్పించాలని కోరారు. తగిన సమయంలో సమస్యలు పరిష్కరించకుంటే ప్రతిఘటనలు, ఆందోళనలు చేపడతామన్నారు. సంఘం సభ్యులు గౌస్, చంద్ర, భాస్కర్, అజయ్, సంజీవుడు, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



జయప్రకాశ్ బాబు (ఫైల్)

ప్యాపిలి: మండల పరిధిలోని వెంగళాంపల్లి గ్రామానికి చెందిన సీనియర్ నాయకుడు జయప్రకాశ్ బాబు (76) శనివారం గుండెపోటుతో మృతి చెందారు. గతంలో ఆయన సర్పంచ్‌గా, ఎంపీటీసీ సభ్యుడిగా, సింగిల్ విండో అధ్యక్షుడిగా సేవలు అందించారు. ఆయనకు భార్య చాయామణి, ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు గజేంద్ర, మెట్టు వెంకటేశ్వర్ రెడ్డి, బోరెడ్డి పుల్లారెడ్డి, రాము, సర్పంచ్ రంగస్వామి, ప్యాపిలి ఉప సర్పంచ్ గద్దం భువనేశ్వర్ రెడ్డి, మాజీ సర్పంచ్ జయశీలమ్మ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

డిప్యూటీ డీఈఓకు వినతి

డోన్ టౌన్: ప్రభుత్వ, గురుకుల పాఠశాలల్లో పని చేసే ఉపాధ్యాయులు ఆయా మండల కేంద్రాల్లోనే నివాసం ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎస్‌టీయూ రాయలసీమ ఇన్‌చార్జ్ ధోనిరాజు, జిల్లా ఉపాధ్యక్షుడు తెలుగు విజయ్‌కుమార్‌లు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం డిప్యూటీ డీఈఓ వెంకటరెడ్డి, మండల విద్యాధికారి ప్రభాకర్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు.

మాజీ సర్పంచ్ ఇంట్లో చోరీ

కొలిమిగుండ్ల: కల్వటాల మాజీ సర్పంచ్ భూలక్ష్మి ఇంట్లో శనివారం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు.. భూలక్ష్మి, రామ్మోహన్ దంపతులు ఇంటిపైన నిద్రించి తల దిండు కింద ఇంటితాళాలు పెట్టారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇంటిపైకి చేరుకుని దిండుకింద ఉన్న తాళాలు తీసుకొని ఇంట్లోకి వెళ్లి బీరువాలో ఉన్న 10 తులాల బంగారు వస్తువులు, రూ. లక్ష నగదును అపహరించారు. తెల్లవారాక ఇంటి తాళాలు కనిపించకపోవడంతో కిందకు దిగి వచ్చారు. అప్పటికే ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. లోపలికి వెళ్లి చూడగా బీరువాలోని వస్తువులు చిందరవందరగా పడి ఉన్నాయి. చోరీ జరిగిందని భావించి పోలీసులకు సమాచారం అందించారు. సీఐ రమేష్‌బాబు సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు ఆరాతీశారు. డాగ్ స్క్వాడ్, ఫ్రింగర్ ప్రింట్ టీంలు ఇంటి పరిసరాలను పరిశీలించారు. చోరీకి పాల్పడింది స్థానికులా లేక ఇతర ప్రాంతాలకు చెందిన వారా అనే కోణంలో విచారణ చేస్తున్నామని సీఐ తెలిపారు.



డాగ్ స్క్వాడ్‌తో ఆధారాలు సేకరిస్తున్న పోలీసులు

ఆర్టీసీ కార్మికుల నిరసన

డోన్ టౌన్: ఆర్టీసీ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ డోన్ డిపో వద్ద ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ అసోసియేషన్ నేతలు శనివారం రెండో రోజు నిరసన కొనసాగించారు. యూనియన్ డిపో అధ్యక్షుడు సీతారామిరెడ్డి, కార్యదర్శి ఐవీఆర్ రెడ్డి, రీజినల్ కమిటీ సభ్యుడు రమణారెడ్డి మాట్లాడుతూ..ం ఎలక్ట్రిక్ బస్సులను ఆర్టీసీ సంస్థే కొనుగోలు చేయాలని, సీసీఎస్ కార్యాలయాన్ని బస్టాండ్‌కు దూరంగా తరలించాలన్న ఆలోచనను విరమించుకోవాలని కోరారు. ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ప్రమోషన్లు, బకాయిలు వెంటనే చెల్లించాలని, డబుల్ డ్యూటీలు చేసే సిబ్బందికి డీడీ అమౌంట్‌ను పెంచాలని డిమాండ్ చేశారు. బ్రేక్‌డౌన్లపై గ్యారేజ్ సిబ్బందికి అక్రమంగా చార్జ్‌షీట్లు జారీ చేసే విధానాన్ని నిలిపేయాలన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు బాషా, దాసు, ఆంజనేయులు, చంద్ర, చారి, కుమార్, రాముడు, ఇస్మాయిల్, ప్రవీణ్‌కుమార్, శైలజ, బసవరాజు, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.



డిపో ఎదుట నిరసన తెలియజేస్తున్న కార్మికులు

సన్మానం

డోన్ టౌన్: కొత్తపేట జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయునిగా పనిచేస్తూ ఇటీవల పదవీ విరమణ పొందిన మాణిక్యంశెట్టికి శనివారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో అభినందన సభ ఏర్పాటు చేసి ఘనంగా సత్కరించారు. ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈఓ రామనర్సప్ప, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

రేబిస్‌పై అవగాహన అవసరం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న పశువైద్యాధికారిణి

అవుకు: పిల్లలకు రేబిస్ వ్యాధిపై అవగాహన అవసరమని అవుకు పశువైద్యాధికారిణి భారతీదేవి అన్నారు. శనివారం అవుకు జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు జంతువుల నుంచి వచ్చే వ్యాధుల గురించి ఎంఈఓ శ్రీధర్ రావుతో కలిసి వివరించారు. కుక్కల నుంచి వచ్చే రేబిస్ ప్రమాదకరమని తెలిపారు. కుక్క కరిచినప్పుడు ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను కలిసి టీకాలు వేయించుకోవాలని సూచించారు. అవుకు పశువైద్యశాలలో కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. కుక్కల యజమానులు వాటికి టీకాలు వేయించాలని సూచించారు.

ఇంటి వద్దకే వైద్య సేవలు

అవుకు: దీర్ఘకాలిక రోగులకు ఇంటి వద్దకే వచ్చి వైద్య సేవలు అందిస్తామని ఉప్పలపాడు పీహెచ్‌సీ డాక్టర్ నవీన్ అన్నారు. శనివారం అవుకు–1 గ్రామ సచివాలయ పరిధిలో 104 వాహనం ద్వారా వైద్య సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీర్ఘకాలిక వ్యాధులతో మంచానికే పరిమితమైన పలువురు రోగుల ఇళ్ల వద్దకు వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. అలాగే గర్భిణులను పరీక్షించి ఆరోగ్య సలహాలు అందించారు. అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాలలను సందర్శించి విద్యార్థులను పరీక్షించారు.

ప్రజా ప్రయోజనాలను విస్మరిస్తే పతనం ఖాయం

- సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించేవరకు పోరాటం
- వైఎస్సార్‌సీపీ రిలేనిరాహార దీక్షలో పార్టీ నేతలు

డోన్: ప్రజా ప్రయోజనాలను విస్మరించి వ్యక్తిగత ప్రయోజనాలు చూసుకుంటున్న అధికార కూటమి నేతల తీరును ప్రజలు గమనిస్తున్నారని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు విమర్శించారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని టీడీపీ నేత వ్యాపార సముదాయ సమీపానికి మార్చడాన్ని నిరసిస్తూ మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి సూచన మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శనివారానికి మూడో రోజు కొనసాగింది. ఈ సందర్భంగా శ్రీరాములు మాట్లాడుతూ...ం ప్రజల ఇబ్బందులను పరిగణనలోకి తీసుకోకుండా స్వలాభాపేక్షతో వ్యవహరిస్తున్నారని టీడీపీ నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ హయాంలో రూ.కోటి వ్యయంతో నిర్మించిన నూతన భవనంలోకే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తరలించాలని డిమాండ్ చేశారు. దీక్షా శిబిరాన్ని వలంటీర్ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుప్రసాద్, ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, వైస్ ఎంపీపీ ఎర్రిస్వామి, మాజీ మార్కెట్‌యార్డు చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు, పార్టీ మండలాధ్యక్షుడు సోమేష్ యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్ హుసేన్, ప్యాపిలి నాయకులు పెద్దపూజెర్ల భాస్కర్‌రెడ్డి, దొరపల్లె చిరంజీవి, గుమ్మకొండ సుధాకర్‌రెడ్డి, బొబ్బల శివరామిరెడ్డి, కుమ్మరి రాజు, గద్దం సురేష్ తదితరులు సందర్శించి సంఘీభావం ప్రకటించారు. మూడో రోజు దీక్షలో రైల్వే నాగేంద్ర, పెయింటర్ వెంకటేష్, శ్యాం, శేఖర్ యాదవ్, కురుకుంద హరి, మిట్టా రవికుమార్, మధురెడ్డి, మహేంద్రనాయుడు, ధర్మవరం శ్రీను పాల్గొన్నారు.



రిలే నిరాహారదీక్షలో వైఎస్సార్‌సీపీ నాయకులు

వైఎస్సార్ జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

బనగానపల్లె: మహానేత దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఈ నెల 8న ఘనంగా నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార కార్యదర్శి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఉదయం 8 గంటలకు మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ఇంటి నుంచి బేతంచర్ల సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించి, అక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి, కేక్ కట్ చేయనున్నట్లు చెప్పారు. అనంతరం కాటసాని స్వగృహంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల కన్వీనర్లు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి

కోవెలకుంట్ల: కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న నిర్వహించతలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు కరీంబాషా, సీఐటీయూ జిల్లా నాయకుడు సుధాకర్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలోని జీవీ కొండారెడ్డి స్మారక గ్రంథాలయ ఆవరణలో కరపత్రాలను విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వం కార్మికు లకు అన్యాయం చేస్తూ 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చిందన్నారు. అలాగే రా ష్ట్రంలో కూటమి ప్రభుత్వం 8 గంటల పనిదినాన్ని 12 గంటలుగా మార్పు చేస్తూ ప్రత్యేక జీఓ తీసుకొచ్చిందన్నారు. సమ్మెను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి శనివారం పర్యటించారు. గ్రామంలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా రూ.50 లక్షలతో నిర్మించిన సీసీరోడ్డును ప్రారంభించారు. ఎంపీడీఓ సాల్మన్, తహసీల్దార్ అనీల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ప్యాపిలి: ఎమ్మార్పీఎస్ ప్యాపిలి మండల నూతన కార్యవర్గాన్ని శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా ఆర్సీ మద్దిలేటి, మండల అధ్యక్షుడిగా రంగన్న, ప్రధాన కార్యదర్శిగా మహేంద్ర, ఉపాధ్యక్షులుగా ఓబులేసు, శివ, మోహన్, ఆదినారాయణ, జాయింట్ సెక్రటరీలుగా గద్దెల బాలరంగన్న, సీహెచ్ బాలకృష్ణ, నాగార్జున, ట్రెజరర్‌గా తిమ్మనాగేంద్రను ఎంపిక చేశారు. అలాగే సీపీఐ మండల కార్యదర్శిగా మహేశ్, సహాయ కార్యదర్శిగా రామకృష్ణ, పట్టణ కార్యదర్శిగా పిక్కిలి వెంకటేశ్ మరో 16 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

ఆలయానికి రూ.30వేల విరాళం



విరాళం అందజేస్తున్న దాతలు

బనగానపల్లె: నందవరం చౌడేశ్వరిదేవి ఆలయాభివృద్ధికి నందికొట్కూరు వాస్తవ్యులు మాదం తరుణ్ కుమార్, తులసి ప్రత్యుష కుటుంబ సభ్యులు శనివారం రూ.30వేల విరాళాన్ని ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ పీవీ కుమార్‌రెడ్డి సమక్షంలో ఆలయ అర్చకులకు అందజేశారు. దాతలకు అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

వైభవంగా స్వాతి వేడుకలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ప్రముఖ వైష్ణవ పుణ్యక్షేత్రమైన మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో ఆషాఢ మాసం సందర్భంగా శనివారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతి ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఉప కమిషనర్, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో వేదపండితులు జ్వాలా చక్రవర్తి మంత్రోచ్ఛారణలతో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతుడైన స్వామివారికి సుప్రభాత సేవ, విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనం, సుదర్శన హోమం, నవకలశ స్నపనం, నరసింహ హోమం, పంచామృత ద్రవ్య తిరుమంజనం, ధన్వంతరి మూలమంత్ర జపం నిర్వహించారు. అలంకార ప్రియుడైన స్వామి వారికి సహస్రదీపాలంకరణ సేవ కనుల పండువగా జరిగింది. అనంతరం ఆలయ మాడ వీధుల్లో గోవింద నామస్మరణలు, మంగళవాయిద్యాల మధ్య ఊరేగింపు ఆకట్టుకుంది. కార్యక్రమంలో ప్రధాన అర్చకుడు మద్దిలేటి స్వామి, అర్చకులు మనోహర్, రాఘవయ్య, మద్దిలేటి స్వామి పాల్గొన్నారు.



పల్లకీపై ఊరేగుతున్న మద్దిలేటి లక్ష్మీ నరసింహస్వామి

క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్

డోన్ టౌన్: క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్తుతో పాటు శారీరక, మానసిక దృఢత్వం సాధ్యమవుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రావు తెలిపారు. శనివారం పట్ట ణ సమీపంలోని కోట్ల విజయభాస్కర్‌రెడ్డి అవుట్‌డోర్ స్టేడియంలో నిర్వహించిన సబ్ జూనియర్, సీనియర్ బాలబాలికల లేజర్ రన్ ఎంపిక పోటీలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. క్రీడల్లో ప్రతిభ చూపే విద్యార్థులకు రాబోయే రోజుల్లో ప్రభుత్వం మంచి అవకాశాలు కల్పిస్తుందని తెలిపారు.పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 11 నుంచి 13 వరకు పల్నాడు జిల్లా నరసరావుపేటలో జరిగే 9వ రాష్ట్రస్థాయి మోడరన్ పెంటతలాన్ పోటీల్లో జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించనున్నారని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా పెంటతలాన్ కార్యదర్శి నవాస్, సంఘం కార్యదర్శులు పృథ్వీ, తరుణ్, పీఈటీలు సుధాకర్, రామ్మోహన్, అబ్దుల్ రహీం, అనీల్, ఓబుల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపాల్

సేవ చేయడం మానవుని కర్తవ్యం

కోవెలకుంట్ల: ప్రతి ఒక్కరూ సేవా గుణం అలవర్చుకుని తమ సంపాదనలో కొంత మొత్తాన్ని దాన ధర్మాలకు వినియోగించాలని ప్రకృతిపీఠం అధ్యక్షుడు పల్లె నరసింహారెడ్డి అన్నారు. శనివారం స్థానిక పరంధామ నిలయంలో అనాథలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు 150 మందికి ఒక్కొక్కరికి రూ.100 చొప్పున పింఛన్లను పంపిణీ చేశారు. 14 ఏళ్లుగా ప్రతి నెలా తమ వంతు సాయంగా పేదలకు పింఛన్లు అందజేస్తున్నట్లు తెలిపారు. ప్రకృతి పీఠం ఉపాధ్యక్షురాలు సుబ్బలక్ష్మమ్మ, రిటైర్డ్ హెచ్ఎం నారాయణస్వామి, మహేశ్వరరెడ్డి, రాములమ్మ పాల్గొన్నారు.



పింఛన్ అందజేస్తున్న ప్రకృతి పీఠం అధ్యక్షుడు

విద్యుత్ చార్జీలు తగ్గించాలని రాస్తారోకో



బేతంచెర్లలో రాస్తారోకో నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు



విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

బేతంచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలను తగ్గించడమే కాకుండా, స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్ అన్నారు. పార్టీ పిలుపు మేరకు శనివారం పట్టణంలోని పాత బస్టాండులో రాస్తారోకో నిర్వహించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన ఏడాదిలోనే విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరుతో ప్రజలపై రూ.15,485 కోట్ల భారం మోపిందని విమర్శించారు. పార్టీ పట్టణ కార్యదర్శి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సర్దుబాటు చార్జీలను తగ్గించకుంటే ఉద్యమం

డోన్ టౌన్: పెంచిన విద్యుత్ సర్దుబాటు చార్జీలు తగ్గించకుంటే ప్రజా ఉద్యమం తప్పదని, స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకయ్య, రాధాకృష్ణ, పార్టీ మండల, పట్టణ కార్యదర్శులు నారాయణ, మోటా రాముడు డిమాండ్ చేశారు. శనివారం విద్యుత్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. విద్యుత్ చార్జీలను పెంచమని చెప్పిన చంద్రబాబు అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ప్రజలపై భారం మోపారని తెలిపారు. అనంతరం ఈఈ కమలాకర్‌రావుకు వినతి పత్రం అందజేశారు.